క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్అర్బన్: విద్యారంగాన్ని నూతన ప్రభుత్వం గాడిలో పెట్టి, సమస్యలను పరిష్కరించాలని తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పరశి కృష్ణవేణి, బట్టు బద్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, ఉద్యోగుల పక్షపాతి అని కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించుకోవాలన్నారు. తెలంగాణ నూతన ప్రభుత్వానికి సంఘం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు పరామర్శ

ఖలీల్వాడి: నగరంలోని బోర్గాం (పి)ప్రభుత్వ జెడ్పీస్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో జీజీహెచ్లో వైద్యచికిత్స పొందుతున్నారు. వారిని గురువారం జిల్లా ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు వరద బట్టు వేణురాజ్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ వార్డెన్, సిబ్బందితోపాటు పాఠశాల అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. అధికారులు వెంటనే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. నాయకులు సయ్యద్ అష్రాఫ్, శివ, సాయికిరణ్, చింటూ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



బోధన్రూరల్(బోధన్) : బోధన్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుద్దె సావిత్రి అధ్యక్షతన గురువారం సాదాసీదా సాగింది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు అభివృద్ధి పనులు, పనుల పురోగతిపై నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీవో మధుకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



బోధన్: ఎన్డీఎస్ఎల్ లేఆఫ్ నాటినుంచి తమకు అందాల్సిన బకాయి వేతనాల కోసం కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. రిలే దీక్షలు గురువారం నాటికి 125వ రోజుకు చేరాయి. కార్మికులు రాజయ్య, ముత్తయ్య, రఘునాథ్ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. నడిచే ఫ్యాక్టరీ మూసివేయడంతో తాము ఉపాధి కోల్పోయామని, ఆర్థిక, ఆరోగ్య సమస్యల కారణంగా చాలా మంది కార్మికులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ఆదుకుంటారేమోనని తొమ్మిదేళ్లు ఆశతో ఎదురు చూశామన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు.

నలందలో రెయిన్బో డే



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్లో గురువారం రెయిన్బో డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఇంద్రధనస్సు రంగుల డ్రెస్సులు ధరించి అలరించారు. పాఠశాల యాజమాన్యం నలంద ప్రసాద్, సాగర్ ఇంద్రధనస్సు రంగుల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్టౌన్: మున్సిపాలిటీ పరిధిలో అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ.. కలెక్టర్ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోని పక్షంలో త్వరలోనే జిల్లా కలెక్టర్ను అడ్డుకుంటామన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు



పెద్దవాల్గోట్ వద్ద కోతకు గురైన రోడ్డు



కంకర పోసి, తారు వేయని రావుట్ల - న్యావనంది రహదారి

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ నుంచి రావుట్ల వరకు రోడ్డు మరమ్మతు పనులు అసంపూర్తిగా జరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తారు రోడ్డు వేసే పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర వేసి, వదిలేశారు. దీంతో వాహనాలు చెడిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర రోడ్డుపై వెలువడుతున్న దుమ్ముతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా పనులను ప్రారంభించి, అసంపూర్తిగా వదిలేయడంతో ఆయా గ్రామాల ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.20 కోట్ల నిధులతో పనులు..

పెద్దవాల్గోట్ నుంచి చిన్నవాల్గోట్, న్యావనంది గ్రామాల మీదుగా రావుట్ల వరకు తారు రోడ్డు రెన్యూవల్ నిర్మాణ పనుల కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. కోటి ఇరవై లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మార్గంలో పాత రోడ్డుపై తారు కంకర లేచిపోయి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ గుంతలను చదును చేసి కంకర పోశారు. నెలలు గడుస్తున్నా రోడ్డుపై తారు వేయడం లేదని రావుట్ల గ్రామస్తులు వాపోతున్నారు. కంకర రోడ్డుపై ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. రావుట్ల, నారాయణపల్లె, జంగిలోడి తండా జీపీ పరిధిలోని ఐదు తండాల ప్రజలు ఈ రోడ్డు గుండానే మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రానికి, భీంగల్, ఆర్మూర్ వైపు రాకపోకలు సాగిస్తుంటారు. ఇదేమార్గంలో పెద్దవాల్గోట్ గ్రామ సమీపంలో కప్పలవాగు ప్రవాహానికి రోడ్డు కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. మూడేళ్లు గడుస్తున్నా ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదు. చిన్నవాల్గోట్ గ్రామస్తులు ఈ మార్గం గుండానే జిల్లా కేంద్రానికి, ఆర్మూర్ వైపు వెళుతుంటారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించి, అవస్థలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

టైర్లు పాడవుతున్నాయి..



మా గ్రామానికి వెళ్లే రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. తారు పోయకపోవడంతో రోడ్డు మీద వెళుతున్నప్పుడు వాహనాల టైర్లు పాడవుతున్నాయి. కంకర రాళ్లు తగిలి గాయాలవుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా ప్రయాణం ఇబ్బందికరంగా మారింది.

– రాజ్కుమార్, రావుట్ల

దుమ్ము భరించలేకపోతున్నాం..



కంకర రోడ్డుపై వాహనాలు వెళ్తుంటే విపరీతమైన దుమ్ము వస్తోంది. దుమ్ము కళ్లల్లో నిండిపోయి అవస్థలు పడుతున్నాం. కంకర పోసి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు తారు వేయడం లేదు. అధికారులు త్వరగా తారు రోడ్డు వేయించి ఇబ్బందులను తొలగించాలి.

– గంగాదాసు, రావుట్ల

హైదరాబాద్కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు





ఎమ్మెల్యే భూపతిరెడ్డితో రూరల్ మండల నాయకులు.. హైదరాబాద్ వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్పల్లి/సిరికొండ/నిజామాబాద్ రూరల్/ఇందల్వాయి: రాష్ట్ర రాజధాని హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో గురువారం జరిగిన సీఎం రేవంత్రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నిజామాబాదరూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. అంతకుముందు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని హైద్రాబాద్లోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాల పార్టీ నాయకులుమర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అమృతాపూర్ గంగాధర్, పాలసాని శ్రీనివాస్, వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యాంసన్, పెద్దోళ్ల శ్రీనివాస్, కంచెట్టి గంగాధర్, డాక్టర్ షాదుల్లా, పులి వెంకటేశ్వరరావు, సాయరెడ్డి, సుదర్శన్, వెంకటస్వామి, నవీన్, యానంపల్లి మురళి, బిల్ల రమేష్, రాజు, బాకారం రవి, గొల్ల ఎర్రన్న, భూషణ్రెడ్డి, బాకారం సంతోష్, కుందేళ్ల శ్రీనివాస్, బండారి నరేష్, రమేష్, భాస్కర్రెడ్డి, గంగారెడ్డి, మోతె నవీన్ రెడ్డి, గర్గుల అజయ్రెడ్డి, పైస ఎల్లయ్య, కోర్వ రాజేంద్రప్రసాద్, నవీన్ గౌడ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డిచ్పల్లి: ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి శంకర్ సూచించారు. మండలంలోని ఘన్పూర్ గ్రామంలో గురువారం గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవిస్తే లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించేలా కృషి చేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవిస్తే ఉచిత వైద్య సేవలతో పాటు సీఎం కిట్, నగదు ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. అదే ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్తే రూ.20వేల నుంచి 25వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఎంఎల్హెచ్పీ గంగాభవాని, ఏఎన్ఎంలు గొల్లపల్లి శైలజ, రజిత తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

ధర్పల్లి: తెలంగాణ నూతన ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఆదుకోవాలని ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన సంఘ నాయకులు, గ్రామపంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో గ్రామపంచాయతీ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో కార్మికులు 34 రోజులు సమ్మె చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి కార్మికులను మోసం చేశారని తెలిపారు. కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో కార్మికులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు ఆశన్న, సాయిలు, భోజన్న, విలాస్, గంగాధర్, సులోచన, సాయవ్వ, గంగన్న పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకు పోరాడుతాం



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ప్రశాంత్రెడ్డి

వేల్పూర్: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను అయోమయానికి గురిచేసి గద్దెనెక్కిందని, హామీల అమలుకు శుక్రవారం నుంచే కౌంట్డౌన్ మొదలవుతుందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారి గురువారం నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా వేల్పూర్ క్రాస్రోడ్డు వద్ద కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రశాంత్రెడ్డి తన తండ్రి స్వర్గీయ వేముల సురేందర్రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వేల్పూర్లోని తన నివాసానికి చేరుకున్నారు. తనను కలిసేందుకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని, లేనిపక్షంలో వెంటాడుతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ప్రాణాలొడ్డి తెచ్చుకున్న తెలంగాణాను దేశంలోనే నంబర్వన్గా నిలిపిన ఘనత కేసీఆర్కే దక్కుతుందన్నారు. అదే ఉద్యమ పంథాను కొనసాగిస్తూ, ప్రతిపక్ష పాత్రను పోషించి ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేద్దామన్నారు. పదిహేను సంవత్సరాలపాటు సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ కోసం పోరాడిన కేసీఆర్, దేశంలోని రాజకీయ పార్టీలను ఒప్పించారన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టారన్నారు. 70 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు అతికష్టంగా పండే మన తెలంగాణాలో.. మూడు కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండించే స్థాయికి రాష్ట్రాన్ని కేసీఆర్ తీసుకువెళ్లారన్నారు. 50 ఏళ్లలో చేయని అభివృద్ధిని తొమ్మిదిన్నరేళ్లలో చేసి చూపిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఇది చిన్నపాటి విరామమని, స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని అన్నారు. ఇంతకు రెట్టింపు వేగంతో వెళ్తామన్నారు. హామీలు అమలవుతున్నాయా? లేదా? అనేదానిపై చర్చ పెట్టాలన్నారు. ప్రజల్లో చురుకుగా, ధైర్యంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ధర్పల్లి: మండలంలోని గోవిందపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. నవగ్రహ దేవతలకు అభిషేకం, ఆరాధన హవనం పూజలను నిర్వహించారు. మరో రెండు రోజులపాటు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గోవులకు పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని పెద్ద రాంమందిరం గోశాలలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ అనఘ ఆర్యవైశ్య సొసైటీ ఆధ్వర్యంలో గురువారం గోవులకు సొసైటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు రేనికింది పద్మ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ భాగ్యలక్ష్మీ, కార్యదర్శి ఎర్ర శ్రీలత, సహాయ కార్యదర్శి శిరీషా, కోశాధికారులు మాధవి, జ్యోతిలు పాల్గొన్నారు.

'వేణుమాల్'పై చర్యలు తీసుకోవాలి



ఖలీల్వాడి: ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న నగరంలోని వేణుమాల్ పీవీఆర్ మల్టీప్లెక్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఈమేరకు ఆమె సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేణుమాల్లో తరచుగా మహిళ సిబ్బందిపై అమానుషంగా వ్యవహరిస్తున్నారన్నారు. సరైన మ్యాన్ పవర్ లేకపోవడంతో సిబ్బందితో ఓవర్ టైం డ్యూటీ చేయిస్తూ, పని ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని. తొలగించిన మహిళ సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధులు దండు శైలజ, గౌరు సుష్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

బాల్కొండ/భీమ్గల్/వేల్పూర్/నందిపేట్/డొంకేశ్వర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోపాటు ముఖ్యమంత్రిగా రేవంత్రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో బాల్కొండ, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు గురువారం సంబురాలు చేసుకున్నాయి. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. భీమ్గల్ పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద పటాకులు కాల్చి ర్యాలీ తీశారు. నాయకులు నాగేంద్ర, సతీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం పడగల్లో విజ యోత్సవ ర్యాలీ నిర్వహించారు. నందిపేట్ మండలం షాపూర్లో కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్, మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు నీరడి సంతోష్, సీనియర్ నాయ కులు కొమురే నరేందర్, గంగారం, కమలాకర్, భోజన్న, భూమేశ్, ఆనంద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి పటాకులు కాల్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి పేదలు, మహిళలు, రైతులకు మేలు చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

'బొకేలు వద్దు.. పుస్తకాలు తీసుకురండి'

సుభాష్నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తనకు అభినందనలు తెలియజేసేందుకు, సన్మానించేందుకు వచ్చే నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, శాలువలు తీసుకురావద్దని ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వాటికి బదులుగా నోట్బుక్కులు తీసుకురావాలని కోరారు. వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు నగరంలోని పలు వివాహ వేడుకలు, నూతన గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణగుప్తా గురువారం హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట నాయకులు, కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, ఇల్లెందుల ప్రభాకర్, పండు, ఆమంద్ విజయ్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే ధన్పాల్ను సన్మానిస్తున్న నాయకులు

సిరికొండ: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణగుప్తాను మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి సన్మానించారు. అల్లూరి రాజేశ్వర్రెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, రంజిత్రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

కేసీఆర్ను కలిసిన బిగాల గణేశ్గుప్తా





మాజీ సీఎం కేసీఆర్తో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్గుప్తా, వీజీ గౌడ్.. బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు

నిజామాబాద్నాగారం/డిచ్పల్లి: మాజీ సీఎం కేసీఆర్ను ఎర్రవెల్లి ఫాంహౌజ్లో గురువారం నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్గుప్తా, మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి వీ.గంగాధర్గౌడ్, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి సేవలు చేసినా, ఎన్నికల్లో ప్రతిపక్ష పాత్ర పోషించాలని బాధ్యత అప్పగించారని పేర్కొన్నారు. రాజకీయంలో గెలుపు, ఓటమిలు సహజమని, మనోధైర్యం కోల్పోకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తూ ప్రజలకు సేవలందేలా చూడాలని సూచించినట్లు వీజీగౌడ్ తెలిపారు.

మాజీ సీఎంను కలిసిన సొసైటీ చైర్మన్

నవీపేట: మండలంలోని బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు గురువారం మాజీ సీఎం కేసీఆర్ను కలిశారు. ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కేసీఆర్ను కలిసి పలు అంశాలపై మాట్లాడినట్లు హన్మాండ్లు తెలిపారు.

యాగాలు పవిత్రమైనవి



బాల్కొండ: యాగాలు పవిత్రమైనవి సచ్చిదానంద భారతీస్వామి అన్నారు. మండలకేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో గురువారం ఎనిమిది జంటలతో యాగం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాగం చేస్తే దోషాలు తొలిగిపోతాయన్నారు. దేవుని సేవలో ప్రతి మానవుడు నిత్యం కొంత సమయం గడపాలన్నారు. హిందూ మతంలోయాగానికి గొప్ప విశిష్టత ఉందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-10.00, 4.45, 7.35 యానిమల్(తెలుగు)-1.00 యానిమల్(హిందీ)-10.35
స్క్రీన్-3	హాయ్ నాన్న -10.10,1.05, 7.45, యానిమల్(హిందీ)- 4.00 ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఎక్స్ట్రాఆర్డినరీమెన్(తెలుగు) -12.00,3.20,6.40, 10.00
స్క్రీన్-2	-యానిమల్(హిందీ)-10.00,2.00 6.00,10.00 యానిమల్(తెలుగు)-2.00
స్క్రీన్-3	ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్-(తెలుగు)-10.10 వంకా(ఇంగ్లీష్)-1.30,7.25,10.10 సామ్ బహదూర్(హిందీ)-4.15
స్క్రీన్-4	యానిమల్(తెలుగు)-11.15,6.30 హాయ్నాన్న(తెలుగు)-3.15, 10.30
దేవి	హాయ్ నాన్న(తెలుగు)
నటరాజ్	యానిమల్(హిందీ)
లలితామహల్	యానిమల్(తెలుగు)
విజయ్	ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)

కూరగాయల ధరలు (రూ.)

	హోల్సేల్	రిటైల్		హోల్సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	14	26	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	15	30	బీట్రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	15	30	గోరుచిక్కుడు	35	50
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	40	60			

– సుభాష్నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,900	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	58,000		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

	ధరలు (కిలోకు)		
చికెన్		డ్రెస్సడ్	180
		లైవ్	160
స్కిన్లెస్	240	మటన్	750

AYESHA COLLEGE OF EDUCATION (B.Ed)
Mallaram (V), Nizamabad (M & Dist)
Phone No: 9848621050, 9849054602
Recognised by NCTE & Govt. of T.S, T.U
Management Quota Seats are Available under 'B' Category
Course: B.Ed, Batch: 2023-25
Last Date: 15-12-2023, (Friday)
Eligibility: B.A./ B.Com/ B.Sc. or any equalent Course with 50% Marks or B.Tech with 55% Marks. SC/ST/BC/PHC Candidates with 40% of Marks are eligible.
Sd/- Secretary & Correspondent

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899